


సొమ్ములిస్తే చాలు!

నిబంధనలు పక్కనపెట్టి మరీ భూ రిజిస్ట్రేషన్లు

వారిదంతా సెప'రేటు'రూటు. పైసలు ఇస్తే చాలు నిబంధనలను సైతం పక్కన పెట్టేస్తారు. అందినకాడికి దండుకుని అక్రమంగా భూముల రిజిస్ట్రేషన్లు చేసేస్తారు. కొన్ని సందర్భాల్లో పత్రాలు సక్రమంగా ఉన్నా.. చేయి తడపనిదే ఫైలును కదలనివ్వరు. ఇక పత్రాలు లేని, వివాదాస్పద భూములైతే తమ నోటికొచ్చినంత అడిగేస్తారు. ఇలా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కొందరు సబ్‌రిజిస్ట్రార్లు తమ కార్యాలయాలను అవినీతికి అడ్డాలుగా మార్చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తొమ్మిది నెలల కాలంలో ముగ్గురు అధికారులు అవినీతికి పాల్పడుతూ ఏసీబీకి అడ్డంగా దొరికినా ఆశాఖలో జరుగుతున్న వసూళ్ల పర్వం ఆగడం లేదు. ఈ దందాలో సదరు అధికారులకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, డాక్యుమెంట్ రైటర్లే సహాయకులుగా వ్యవహరిస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్లకు ఇవ్వాల్సి సొమ్ముతో పాటు డాక్యుమెంట్ తయారీ ఖర్చుల పేరుతో వారు కూడా వసూళ్లకు దిగుతున్నారు. లింకు డాక్యుమెంట్లు సక్రమంగా లేకపోవటం, వివాదాస్పద భూములు, నాలా కన్వర్షన్ లేని భూములు, సాక్షులు అందుబాటులో లేకపోవటం లాంటివి సాకుగా చూపి రూ.5వేల నుంచి రూ.2లక్షల వరకు లంచంగా గుంజుతున్నారనే ఆరోపణలున్నాయి.

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

హనుమకొండ పట్టణానికి చెందిన ఓ ఉద్యోగి ఓ ప్లాట్ కొనుగోలు చేశాడు. అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నాయి. కానీ డాక్యుమెంట్ రైటర్ రూ.5వేలు ఇస్తే వెంటనే రిజిస్ట్రేషన్ అవుతుందని, లేదంటే కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుందని చెప్పాడు. తనకు అన్ని పత్రాలు సక్రమంగా ఉండటంతో మామూళ్లు ఇచ్చేందుకు సదరు ఉద్యోగి ససేమిరా అనటంతో.. వారానికి పైగా కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చింది. దీంతో అడిగింది ఇచ్చి 24గంటల్లో పని పూర్తి చేయించుకున్నాడు.

- కొందరు సబ్ రిజిస్ట్రార్ల సెప'రేటు' దందా
- నాలా కన్వర్షన్ లేకున్నా అసైన్డ్ భూములకు సైతం దర్జాగా రిజిస్ట్రేషన్లు
- ఒక్కో డాక్యుమెంటుకు రూ.10వేల నుంచి రూ.20 వేలకు వరకు వసూలు
- వివాదాస్పద భూములైతే భూమి విలువలో 10శాతం డిమాండ్
- సహాయకులు, దిగువస్థాయి సిబ్బంది ద్వారా వసూళ్ల పర్వం
- తొమ్మిది నెలల్లో ముగ్గురు సబ్‌రిజిస్ట్రార్లు ఏసీబీకి చిక్కినా మారని మిగతావారి తీరు
- అక్రమాలకు అడ్డాగా ఓరుగల్లు కార్యాలయాలు
- ఉమ్మడి జిల్లాలో తిష్టవేసిన పొరుగు జిల్లా అధికారులు

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా, గత ఏడాది ఇక్కడ పనిచేసిన ఆర్వోలంతా బదిలీ అయ్యారు. ఈ బదిలీల్లో ఎక్కువ శాతం ఖమ్మం జిల్లాకు చెందిన ఆర్వోలు ఉమ్మడి వరంగల్‌కు వచ్చారు. ఈ బదిలీల ప్రక్రియలోనూ భారీగానే సొమ్ముల చేతులు మారాయనే ఆరోపణలు వినిపించాయి. అయితే పొరుగు జిల్లా నుంచి వచ్చిన కొందరు అధికారులు పెట్టిన ఖర్చులను రాబట్టుకునే పనిలో భారీగా వసూళ్లకు దిగుతున్నారనే ప్రచారం జరుగుతోంది. దీంతో భూముల రిజిస్ట్రేషన్ కొంతమంది సబ్‌రిజిస్ట్రార్ల కాసుల పంట పండిస్తుందనే చర్చ జరుగుతోంది. ఒక్కొక్క ఏరియా.. రిజిస్ట్రేషన్ చేయాల్సిన భూములను బట్టి.. రేట్లు పెట్టి మరీ వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నా ప్రతీ డాక్యుమెంట్‌కు రూ.2వేల నుంచి రూ.10వేల వరకు ఇచ్చుకోవల్సిందేనని బాధితులు వాపోతున్నారు. చెయ్యి తడపకుంటే రిజిస్ట్రేషన్ కాగితాల్లో ఏదో ఒక తప్పును గుర్తించి రోజులు, నెలల తరబడి తిప్పుతున్నారు. దీంతో అడిగినంత ఇచ్చుకుని రిజిస్ట్రేషన్ తంతు ముగించుకుంటున్నారు. ఇక నాలా కన్వర్షన్ లేకున్నా కూడా చాలా ప్రాంతాల్లో దర్జాగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్నారు. అన్ని జిల్లా కేంద్రాలతో పాటు మునిసిపాలిటీ ఏరియాల్లో గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జరిగింది. అయితే చాలా చోట్ల నాన్‌లేవుట్ ప్లాట్లు కొనుగోలు చేసిన వారు, ఫామ్‌ల్యాండ్ పేరిట భూములు కొనుగోలు చేసినవారికి చాలా వరకు నాలా కన్వర్షన్ లేదు. దీంతో ఇంటి నిర్మాణానికి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ అవసరం కావటంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇదే అదనుగా వీటి కోసం ప్రతీ డాక్యుమెంట్‌కు రూ.20వేల నుంచి రూ.50వేల వరకు ఏరియాను, భూమికి మార్కెట్ విలువను బట్టి దళారులు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో నాన్ లేవుట్ ప్లాట్లతో వ్యాపారం చేస్తున్న రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు కాసుల పంట పండుతుండగా, ప్రభుత్వ ఆదాయానికి భారీగా

మిగతా 7వ పేజీలో...


వాజేడు పరీక్షా కేంద్రం వద్ద బారులు తీరిన విద్యార్థులు

ప్రారంభమైన 'పది' పరీక్షలు

భూపాలపల్లిటౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నిర్వహించిన పదో తరగతి పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. 3449 మంది విద్యార్థులకు గాను 3441 మంది విద్యార్థులు హాజరుకాగా 8 మంది గైర్హాజరైనట్లు డీఈవో రాజేందర్ తెలిపారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సింగరేణి ఉన్నత పాఠశాల, గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి కాటారం మండలంలోని మూడు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

ములుగులో..

ములుగు : పదో తరగతి వార్షిక పరీక్షలు జిల్లాలో శుక్రవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. 9 మండలాల్లో కలిపి మొత్తం 21 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రైవేటు విద్యార్థులతో కలిపి 3,135 మంది విద్యార్థులకు గానూ అందరూ పరీక్షకు హాజరయ్యారు. ఉదయం 8.30గంటల నుంచే విద్యార్థులను పరీక్షా కేంద్రాల లోకి అనుమతించారు. కేంద్రాల చుట్టూ 144సెక్షన్ విధించిన పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలకు దూరంగా ఉన్న పాఠశాలల విద్యార్థుల కోసం కన్నాయిగూ డెం, ములుగులో ఆర్టీసీ రెండు సర్వీసులను నడిపించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రశ్నాపత్రాలను తెరిచిన అధికారులు పరీక్ష ముగిసిన తర్వాత సీల్‌వేసి పోలీసు భద్రత నడుమ పోస్టాఫీసులో డిపాజిట్ చేశారు. తొలిరోజు పరీక్ష విజయ వంతంగా జరిగిందని డీఈవో పాణిని తెలిపారు. జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర ములుగులోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు.

అకాల వర్షం.. అన్నదాతకు నష్టం

చిట్యాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి అకాల వర్షం కురిసింది. వర్షంతో మొక్కజొన్న, మిర్చి కళ్లాలు తడిసిముద్దయ్యాయి. మొదటగా చిరుజల్లులు మొ దలవ్వడంతో పంట సరుకులను కాపాడుకునేందుకు రైతులు పరదాలతో పంట చేళ్లకు పరుగులు తీశారు. అనంతరం అకాల వర్షం, గాలులతో వరి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న మొక్కజొ న్న కల్లాల్లోని మిరప వరుగు తడిసి ముద్దయ్యాయి. ఆరుగాలం కష్టపడి పండిం చిన పంట చేతికి అందే సమ యంలో వీచిన గాలి, వర్షంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడి రాక.. దిగులు చెంది

యువ రైతు ఆత్మహత్య

ఒప్పంద కంపెనీ మాటలు నమ్మి మొక్కజొన్న వేసి మోసపోయిన వైనం

దిగుబడిరాక, పెట్టుబడికి అప్పులు చేసి తనువు చాలించిన అన్నదాత

వెంకటాపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తును తట్టుకుని పంట సాగు చేసి నాలుగు పైసలు సంపాది ద్దామనుకున్న రైతులకు ఉరికొయ్యలే మిగులుతున్నాయి. సేద్యం చేసే రైతన్న ఛిద్రమవుతున్నాడు.. కంపెనీ వారు చెప్పిన మాటలు నమ్మి పంట సాగు చేసి మోసపోయిన ఓ మొక్కజొన్న కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సం ఘటన ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో జరిగింది. మండలం లోని చిరుతపల్లి గ్రామానికి చెందిన లఖం మధుకృష్ణ(29)అనే వ్యక్తి స్థానిక ఓ రైతుకు చెందిన రెండెకరాలను కౌలుకు తీసుకుని హైటెక్ అనే కంపెనీ విత్తనాలను వేశాడు. సదరు కంపెనీ ప్రతినిధులు సీడ్ ఇచ్చేప్పుడు రెండకరాల్లో ఎనిమిది టన్నుల పంట వస్తుందని, ఆ పంటను తామే కొనుగోలు చేసుకుం టామని ఒప్పందం చేసుకున్నారు. ఆ తర్వాత పంట వేసిన మధుకృష్ణ అప్పుతెచ్చి మరీ పెట్టుబడి పెట్టాడు. కానీ రెండు టన్నులు మాత్రమే పంట దిగుబడి రావడం, సద రు కంపెనీ వారు అడ్రస్ లేకపోవడంతో ఆందోళనకు గురయ్యాడు. ఓ వైపు భూమి యజమానికి చెల్లించాల్సిన కౌలు సొమ్ము, మరోవైపు పెట్టుబడికి పెట్టిన సొమ్ములు కలిపి సుమారు రూ.2లక్షలు కావడం, వాటిని తీర్చేదారి లేకపోవడంతో గురువారం పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వెంటనే కుటుంబసభ్యులు అతడిని వెంకటాపు రం వైద్యశాలకు, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఎంజీఎం లో చికిత్స పొందుతూ మధుకృష్ణ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. కాగా, రైతు కుటుంబానికి న్యాయం చేయాలని, నష్టపరిహారం ఇప్పించాలని గిరిజ న సంఘాలు మధుకృష్ణ మృతదేహం తో వెంకటాపురం ప్రధాన రహదా రిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఈ క్రమంలో పోలీసులు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం స్వగ్రామంలో అంత్యక్రియలు పూర్తిచేశారు.


మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న గిరిజన సంఘాలు, గ్రామస్థులు


మధుకృష్ణ (ఫైల్)

బతుకులు బూడిదపాలు

- రోగాల బారిన దుబ్బపల్లి గ్రామస్థులు
- చోద్యం చూస్తున్న జెన్‌కో యాజమాన్యం
- మండి పడుతున్న ప్రజలు
- ఫ్లైయాష్ రవాణా లేక ప్రభుత్వ ఆదాయానికి గండి
- రేటు గిట్టక నష్టపోతున్న లారీ యజమానులు

గణపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): థర్మల్ పవర్ ప్రాజెక్టు వస్తే.. తమ బతుకులు మారుతాయని భావించారు ఈ ప్రాంత ప్రజలు. కానీ అదే ప్రాజెక్టు తమ ప్రాణాలను బూడిదలో కలుపుతుందని వారు ఊహించనేలేదు. ఏనాడో పక్కనే ఉన్న గ్రామాన్ని సురక్షిత ప్రదేశానికి తరలించాల్సి ఉండగా... ఏళ్లు గడుస్తున్నా.. పట్టనట్లు వ్యవరిస్తుంది.. జెన్ యాజమాన్యం. ఇదేంటని ప్రశ్నించిన ప్రజలపై ఇప్పటికే పలు కేసులుపెట్టి మరోసారి ప్రశ్నించకుండా చేశారనే వాదనలు కూడా లేకపోలేదు. ప్రజల ప్రాణాలంటే.. వీరికి లెక్కలేదా..? అంటూ గ్రామస్థులు తమ గోడును వెల్లబోసుకుంటున్నారు. అర్ధరాత్రి దాటాక బూడిదను గాలిలో కలుపుతుండడంతో ఊరిపై పడి తమ బతుకులు తెల్లారనున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఫ్లైయాష్ ను గతంలో ఉచితంగా ఇచ్చిన యాజమాన్యం.. ఇప్పుడు ఎక్కడా లేని విధంగా రూ.300కి పెంచి దానిని ఎవరూ కొనగోలు చేయలేని స్థితికి తీసుకువచ్చి... ఇప్పుడు ఈ ప్రాంత లారీ యజమానులకు తీరని నష్టం మిగుల్చుతుంది.

గణపురం మండలం చెల్పూరు సమీపంలో దుబ్బపల్లి గ్రామాన్ని ఆనుకుని సుమారు 1100 ఎకరాల్లో కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టును 2005లో అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది. ఈ ప్రాజెక్టు వస్తే ఇక్కడి ప్రజల బతుకులు మారుతాయని, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని స్పష్టం చేసింది. అనుకున్న విధంగా అంతా సవ్యంగానే జరిగినా.. కేటీపీపీ ప్రభావిత ప్రాంతమైన దుబ్బపల్లి గ్రామ ప్రజల గోస ఎవరికీ పట్టడం లేదు. కొంతమందికి ఉపాధి లభించిందన్న మాట వాస్తవమే అయినప్పటికీ.. వారి ఆరోగ్యం పట్ల ఎవరూ శ్రద్ధ చూపించడం లేదని, ఏళ్ల గడుస్తున్నా.. గ్రామాన్ని తరలింపు చేయడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


గ్రామాన్ని ముంచెత్తుతున్న బూడిద

ప్రతీరోజు అర్ధరాత్రి దాటాక కేటీపీపీ ఫ్లైయాష్‌ను (బూడిద) గాలిలోకి వదులుతున్నట్లు గ్రామస్థులు తెలుపుతున్నారు. దీంతో గాఢ నిద్రలో ఉన్న తాము ఆ దుమ్ము, దూళిని తెలియకుండానే పీల్చుకునే దుస్థితి దాపురించిందని వాపోతున్నారు. అంతేకాదు.. ఆ గ్రామానికి ఆ సమయంలో వెళ్లే గ్రామస్థులు ఎదురుగా వస్తున్న వాహనం కానీ, మనిషి గానీ కనిపించనంతగా బూడిద గాలిలో తేలియాడుతుండడం, ఆ సమయంలో బైక్‌పై వెళ్లినా, కాలినడకన వెళ్లినా.. శ్వాస కూడా ఆడనంత భయానకంగా బూడిద మనుషుల పైన పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు.. మరికొంత బూడిదను కొంతకాలంగా చెరువులోకి వదులుతుండడం వల్ల ఆ చెరువు నుంచి మరలా నీరు మోరంచవాగులోకి చేరి వాగులోని నీరంతా కలుషితం అవుతుందని రైతులు చెబుతున్నారు. ఇలా రెండు విధాలా తమకు నష్టం జరుగుతోందని తెలుపుతున్నారు. కాలుష్యం మూలంగా అనేక అనారోగ్య

మిగతా 8వ పేజీలో...


రహదారి వెంట ఉన్న యాష్ తీసుకెళ్లే లారీలు

గాలిలో కలుస్తున్న ఫ్లైయాష్


కేటీపీపీ

రేపు వెయిట్ లిఫ్టింగ్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

డోర్నకల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఈనెల 23 (ఆదివారం) ఎన్నుకోనున్నట్లు అసోసియేషన్ జిల్లా సెక్రటరీ మండలోజు సుధాకర్ తెలిపారు. ఈ ఎన్నికలను డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ భవనంలో నిర్వహించనున్నట్లు సుధాకర్ తెలిపారు. జిల్లాలోని వివిధ వ్యాయామశాలలకు చెందిన వెయిట్‌లిఫ్టర్‌లు, కోచ్‌లు, హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

హైడ్రాలిక్ ఫెయిలై.. ట్రాక్టర్ ట్రక్కు పడి రైతు మృతి

దంతాలపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఓ గిరిజన రైతుపై ట్రాక్టర్ డబ్బాపడి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలంలోని బొడ్లాడ శివారులో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై పిల్లల రాజు తెలిపిన వివరాల ప్రకారం... నర్సింహులపేట మండలం కొమ్ములవంచ గ్రామ శివారు దుబ్బతండాకు చెందిన జాటోతు రమేష్(35) తన వ్యవసాయ భూమి వద్ద మొక్కజొన్న లోడు కోసం ట్రాక్టర్‌ను తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ డబ్బా పైకి లేపేందుకు హైడ్రాలిక్ ఉపయోగించగా హైడ్రాలిక్ ఫెయిలై రమేష్ మెడపై పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య నీల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



సారమ్మ మృతదేహం

కృష్ణకాలనీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని సీఆర్‌నగర్‌కు చెందిన గాజుల సారమ్మ(56) అనే మహిళ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. భూపాలపల్లి సీఐ నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... సారమ్మ గత కొంతకాలంగా బీపీ, షుగర్, కీళ్ల నొప్పులతో బాధపడుతోంది, దీంతో పాటు తన కుమారుడైన మహేష్‌కు ఇద్దరు ఆడపిల్లలే పుట్టారని, తనకున్న భూమిలో వేసిన పంట పండలేదని నిత్యం బాధపడుతూ మనోవేదనకు గురయ్యేది. ఈ క్రమంలో ఈ నెల 20న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు సేవించింది. అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆమెను కుటుంబ సభ్యులు గమనించి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. దీంతో ఆమె పరిస్థితి విషమించి మృతి చెందింది. ఆమె కుమారుడు మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ స్పష్టం చేశారు.

ఏజెన్సీలో పేలిన ప్రెషర్ బాంబు

- ఒకరికి తీవ్ర గాయాలు, ముగ్గురికి స్వల్ప గాయాలు
- వెదురుబొంగుల సేకరణకు వెళ్లిన క్రమంలో ఘటన
- ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో అలజడి



వెంకటాపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బొగ్గుల కృష్ణమూర్తి

వెంకటాపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పోలీసులే లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన ప్రెషర్ బాంబు పేలి వెదురుబొంగుల సేకరణకు వెళ్లిన ఓ వ్యక్తి తీవ్రంగా, మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. ములుగు జిల్లా అడవుల్లో శుక్రవారం జరిగిన ఈ సంఘటన తీవ్ర సంచలనం రేపింది. ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఇప్పగూడెం గ్రామానికి చెందిన బొగ్గుల కృష్ణమూర్తి, సోడి నర్సింహారావు, కుర్సం ఎడమయ్య, పూనూరి నగేష్ అనే నలుగురు వ్యక్తులు సమీపంలోని వీరభద్రవరం గ్రామ అటవీ ప్రాంతంలోని ముత్యంధార జలపాతం అటవీ ప్రాంతంలో వెదురుబొంగులను సేకరించేందుకు వెళ్లారు. గుట్టపైకి ఎక్కి వెదురుబొంగులను సేకరించుకుని కిందికి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తుండగా బొగ్గుల కృష్ణమూర్తి ప్రెషర్‌బాంబ్‌పై కాలు వేశాడు. అది ఒక్కసారిగా పేలడంతో రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. అయితే ఆ ముగ్గురు కాళకు గాయాలైన కృష్ణమూర్తికి గడ్డితో కట్టు కట్టి ప్రధాన రహదారికి తీసుకొచ్చి 108కు సమాచారం ఇచ్చారు. అక్కడి నుంచి వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. కాగా, గతేడాది సైతం వాజేడు, వెంకటాపురం మండలాల్లో ఇలాంటి సంఘటనలు రెండు జరగ్గా ఒక వ్యక్తి మృతి చెందగా.. మరొక మహిళ కాలును తొలగించారు.

అమాయకులను బలి తీసుకుంటున్న మావోయిస్టులు : ఎస్పీ శబరీశ్

ములుగు : అడవుల్లోని కాలిబాటలలో మందుపాతరలు అమర్చుతున్న మావోయిస్టులు అమాయకుల ప్రాణాలను బలి తీసుకుంటున్నారని ములుగు జిల్లా ఎస్పీ శబరీశ్ అన్నారు. వెంకటాపురం మండలం ఇప్పగూడెం గ్రామానికి చెందిన ఆదివాసీ యువకుడు బొగ్గుల కృష్ణమూర్తి ముత్యాలధార జలపాతం సమీపంలో శుక్రవారం ప్రెషర్ బాంబు పేలి తీవ్రంగా గాయపడగా ఈ సంఘటనను ఖండిస్తూ ఎస్పీ ప్రకటన విడుదల చేశారు. కర్రెగుట్టలను గెరిల్లా బేస్‌క్యాంపుగా మార్చే ప్రయత్నంలో మావోయిస్టులు తమ ఉనికిని చాటుకోవడం కోసం మందుపాతరలు అమర్చుతున్నారని, అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం వెళ్లిన ప్రజలు వీటిబారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు.

గతంలో వాజేడుకు చెందిన ఇల్లందుల ఏసు అనే వ్యక్తి ప్రెషర్ బాంబు పేలి మరణించగా.. మరో రెండు సంఘటనలలో వెంకటాపురం మండలానికి చెందిన డర్ర సునీత, బొగ్గుల నవీన్‌లు తీవ్రంగా గాయపడ్డారని ఎస్పీ శబరీశ్ వెల్లడించారు. వెంకటాపురం, వాజేడు మండలాల ప్రజలు అడవిలోకి వెళ్లిన సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, మందుపాతరలు, అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రజా సంఘాలు స్పందించాలని ఎస్పీ కోరారు.

జాతీయ రోయింగ్ పోటీలకు హేమంత్ ఎంపిక



కేసముద్రం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పంజాబ్ రాష్ట్రం చండీఘర్‌లో ఈనెల 22 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించే జాతీయ అంతర్ విశ్వవిద్యాలయాల రోయింగ్ పోటీలకు ఉస్మానియా యూనివర్సిటీ తరపున కేసముద్రం స్టేషన్‌కు చెందిన నల్లగొండ హేమంత్ ఎంపికైనట్లు హైదరాబాద్ జేఎన్‌టీయూ పీడీ అశోక్ శుక్రవారం తెలిపారు. హేమంత్ హైదరాబాద్‌లోని లయోల కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతుండగా ఇప్పటికే పలు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాడు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు హేమంత్‌ను అభినందించారు.

వీవోఏల వేతనాలు పెంచాలని మంత్రులకు వినతి



మంత్రి పొంగులేటికి వినతి పత్రం అందజేస్తున్న మారిపెల్లి మాధవి

మరిపెడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : వీవోఏల వేతనాలు పెంచాలని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు మరిపెడ మండలం చిల్లంచర్ల వీవోఏ, సంఘ రాష్ట్ర బాధ్యురాలు మారిపెల్లి మాధవి నేతృత్వంలోని సంఘ ముఖ్యులు శుక్రవారం హైదరాబాద్‌లోని వారి చాంబర్లో కలిసి వినతి పత్రం అందచేశారు. వీవోఏలకు చెందిన పలు పెండింగ్ డిమాండ్లను మంత్రులకు వివరించారు. ఈసందర్భంగా మంత్రులు సానుకూలంగా స్పందించారని మాధవి పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, వీవోఏ సంఘం గౌరవ అధ్యక్షుడు రూప్‌సింగ్‌ల సహకారంతో రాష్ట్ర మంత్రులను కలిసి తమ డిమాండ్లను వారి దృష్టికి తీసుకెళ్లామన్నారు. మహిళా సాధికారిత, వారి ఆర్థిక అభివృద్ధిలో వీవోఏల పాత్ర ఎంతో కీలకమని గుర్తుచేశారు.

మానుకోట అభివృద్ధికి సహకరించండి

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి బీజేపీ జిల్లా నేతల వినతి

మహబూబాబాద్ రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా గిరిజనులు ఉన్నారని, వెనుకబడిన ప్రాంతమని, ఈ ప్రాంత అభివృద్ధికి కేంద్రం నుంచి అధిక నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని మహబూబాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఢిల్లీలోని మంత్రి కిషన్‌రెడ్డి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వల్లభు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఢిల్లీకి వెళ్లే ఏపీ ఎక్స్‌ప్రెస్, గ్రాండ్ ట్రాక్, జైపూర్‌కు వెళ్లే జైపూర్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్టణం వందేభారత్‌ను మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో, పద్మావతి ఎక్స్‌ప్రెస్‌ను కేసముద్రం రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఆయన వెంట చీకటి మహేష్‌గౌడ్, సింగారపు సతీష్, గుగులోతు మదన్‌లాల్ ఉన్నారు.



ఎల్లంపేట ఎఫ్ఏ అవినీతిపై విచారణ

- వాగ్వాదానికి దిగిన ఇరు వర్గాలు



మరిపెడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఎల్లంపేట ఎఫ్ఏపై వచ్చిన పలు అవినీతి, అక్రమాల ఆరోపణలపై శుక్రవారం జీపీ భవన్‌లో మరిపెడ ఎంపీడీవో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎఫ్ఏ అనుకూల, వ్యతిరేక వర్గాల వారి మధ్య మాటామాట పెరిగి ఘర్షణ పడ్డారు. కేవలం ఫిర్యాదుదారులకు మాత్రం విచారణ విషయం చెప్పి తమకెందుకు చెప్పలేదని ఎఫ్ఏ అనుచరులు ఎంపీడీవోను ప్రశ్నించారు. ఎవరైతే ఎఫ్ఏపై ఆరోపణలు చేశారో, వారిని పిలిచి తగు ఆధారాలు చూపాలని కోరామని చెప్పడంతో వారు శాంతించారు. ఎఫ్ఏ తన కుటుంబసభ్యుల పేరు మీద నాలుగు జాబ్‌కార్డులు పొంది, ఇంకో ఐదారుగురు పేర్లను నమోదు చేసుకొని, పనికిరాకున్నా పనిచేసినట్లు మస్టర్లు రాసుకున్నారని బాధితులు ఆరోపించారు. ఇంకా అనేక అవినీతి, అక్రమాలను విచారణాధికారికి సమర్పించారు. ఈసందర్భంగా ఎంపీడీవో విజయ మాట్లాడుతూ విచారణ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. ఎంపీవో సోమ్లానాయక్, ఈసీ నరేశ్, టీఏ సందీప్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

యత్నారం సమీపంలో కార్చిచ్చు

- నిమ్మగూడెం నుంచి సింగంపల్లి వరకు వ్యాపించిన మంటలు



మహాముత్తారం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలోని నిమ్మగూడెం గ్రామ సమీపం నుంచి సింగంపల్లి వరకు రోడ్డుకు ఇరువైపులా అడవిలో అంటుకొన్న కారుచిచ్చుతో పచ్చని అడవులు కాలి బూడిదవుతున్నాయి. గత మూడురోజులుగా మంటలు దావాగ్నిలా మారి అగ్నికీలలు అడవిని దహించి వేస్తున్నాయి. ఈ కారుచిచ్చుతో సుమారు వంద ఎకరాల్లో అడవి ఎడారిలా మారిపోతుంది. అటవీ శాఖ అధికారులువెంటనే మంటలను అదుపులోకి తీసుకురావాలని యత్నారం, సింగంపల్లి గ్రామస్తులు కోరుతున్నారు. మంటలు వ్యాపించి గ్రామాల సమీపంలోకి వస్తే గాలి దుమారంతో తమ పూరిళ్లు అంటుకొనే అవకాశమున్నదని ప్రజలు ఆందోళన చెందుతు న్నారు. ఈ విషయంలో పెగడపల్లి రేంజర్ వెంకటేశ్వర్లును వివరణ కోరగా ఆయా సెక్షన్లలో పనిచేసే సిబ్బందిని మంటలు అంటుకున్న ప్రాంతాలకు పంపిస్తున్నామని తెలిపారు.

అనుమతులు లేని బయోమందుల పట్టివేత

- రూ.6లక్షల విలువైన సామగ్రి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ శివం ఉపాధ్యాయ



వాహనంలో ఉన్న బయో ప్రొడక్ట్ మందులను పరిశీలిస్తున్న ఏఎస్పీ

ఏటూరునాగారం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా అక్రమంగా బయో ప్రొడక్ట్ మందులు విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా దాడి చేసి పట్టుకున్నారు. శుక్రవారం స్థానిక ఏఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్‌టీఆర్ జిల్లా కంచికచర్ల గ్రామానికి చెందిన రావూరి వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురం ప్రాంతంలోని ఓ కాలనీలో (12-364) నంబరు గల ఇంట్లో అద్దెకు ఉంటూ సుమారు రెండేళ్లుగా నివాసం ఉంటున్నాడని తెలిపారు. అయితే.. వెంకటేశ్వరరావు అనుమతులు లేకుండా బయో ప్రొడక్ట్ మందులు నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం అందిందని తెలిపారు. దీంతో పోలీస్ సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి గురువారం అర్ధరాత్రి సమయంలో ఆ ఇంటిపై ఆకస్మికంగా దాడి చేశామన్నారు. ఈ దాడిలో అక్రమంగా నిలువ చేసి ఉంచిన రూ.6లక్షల విలువైన బయో ప్రొడక్ట్ మందులను స్వాధీనం చేస్తున్నామని చెప్పారు. 410 లీటర్ల ద్రవ పదార్థం, 30 కిలోల ఘన పదార్థం గల బయో ప్రొడక్ట్ మందులను పట్టుకున్నామన్నారు. పంచనామా నిర్వహించి అనుమతులు లేకుండా విక్రయిస్తున్న బయో మందులను, అలాగే వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఏఎస్పీ పేర్కొన్నారు. అదేవిధంగా మందుల రవాణాకు ఉపయోగిస్తున్న ఈకో వ్యాన్(ఏపీ 39 డీజీ 3287)ను సీజ్ చేశామని చెప్పారు. రావూరి వెంకటేశ్వరరావు గత రెండేళ్లుగా ఎలాంటి అనుమతులు లేకుండా బయో ప్రొడక్ట్ మందుల వ్యాపారం చేస్తున్నట్లు ఏఎస్పీ వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల, ములుగు జిల్లా వెంకటాపురం మండలాల్లో ఈ మందులను విక్రయిస్తున్నట్లు వివరించారు. ఈ సంఘటనపై సంబంధిత శాఖ అధికారులు కూడా చర్యలు తీసుకుంటారని తెలిపారు. నిందితుడిపై కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఏఎస్పీ శివం ఉపాధ్యాయ పేర్కొన్నారు.

పంట తీసుకెళ్లడం లేదని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

మల్లూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చేతికొచ్చిన మొక్కజొన్న పంటను సీడ్ ఇచ్చిన కంపెనీ ప్రతినిధులు తీసుకొని వెళ్లడం లేదని తాడిచర్ల గ్రామానికి చెందిన రైతు అర్ని ప్రసాద్ కొయ్యూర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు శుక్రవారం తెలిపాడు. రైతు తెలిపిన ప్రకారం... తనకున్న మూడున్నర ఎకరాల్లో ఓ కంపెనీ సీడ్ మొక్కజొన్న పంటను వేసినట్లు తెలిపాడు. పంట వేసిన సమయంలో కంపెనీ ప్రతినిధులు నాలుగు నెలల తర్వాత వచ్చి తీసుకువెళ్తామని చెప్పారని ఐదు నెలలు కావస్తున్న ఇప్పటికి రాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. కోతులు, చిలుకలు, పందుల బెడద ఎక్కువగా ఉందని, మొక్కజొన్న పంట పచ్చిగా ఉన్న సమయంలో తీసుకొని వెళ్తామని చెప్పారని ఇప్పుడు కంపెనీ ప్రతినిధులకు ఫోన్ చేస్తే స్పందించడం లేదన్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.50వేల ఖర్చు వచ్చిందని పంటను తీసుకొని వెళ్లకపోతే తాను తీవ్రంగా నష్టపోతానని రైతులు తెలుపుతున్నాడు. ఈ విషయంపై స్థానిక వ్యవసా యాధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపాడు. చేసేది లేక చివరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని అన్నారు. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని రైతు కోరుతున్నాడు.



మొక్కజొన్న చేను వద్ద బాధిత రైతు

ప్రారంభమైన శ్రీసీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల్లో పూజలు చేస్తున్న అర్చకులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో తొలి రోజు 21 శుక్రవారం పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి సప్తమ బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 21 నుంచి 26 వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఎం.వి.కృష్ణప్రసాద్, శ్రీ వాత్సవ, మిషన్ బాబుల వేదమంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 8 గంటలకు విష్వక్సేనపూజ, పుణ్యాహవచనము, పంచగవ్యప్రాసన, ధ్రువ ఉత్సవమూర్తులకు పంచామృత ఫలరస అభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం 6 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనము, రక్షాబంధనం, అజస్ర దీపారాధన, దీక్షాస్వీకరణమేధినీ పూజ, అంకురారోహణ, వాస్తుహోమం, ధ్వజపటన ధాన్యాదివాస పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి

మొగుళ్లపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వృద్ధుడు మృతి చెందిన సంఘటన భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై బి.అశోక్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మొగుళ్లపల్లి గ్రామ శివారులోని ఆరెపల్లికి చెందిన కనుకుంట్ల వీరమల్లు(65) రోజువారీ లాగా నిత్యం హనుమాన్ దేవాలయంలో పూజలు చేస్తుండేవాడు. కాగా, శుక్రవారం ఉదయం పూజ చేసేందుకు దేవాలయానికి ఉన్న గేట్ తీస్తున్న క్రమంలో విద్యుత్ వైర్లు ఫెయిల్ అయి గేట్‌కు తాకి ఉండడంతో వీరమల్లు గేట్ నెట్టగా ఒక్కసారిగా విద్యుత్ ప్రసారం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాజీరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

ఎట్టకేలకు వట్టివాగుకు ఎస్ఆర్ఎస్పీ జలాలు

- 'ఆంధ్రజ్యోతి' కథనం, ఎమ్మెల్యే చొరవతో కళకళ



అర్పనపల్లి వద్ద వట్టివాగు చెక్‌డ్యాంపై నుంచి ప్రవహిస్తున్న జలాలు

కేసముద్రం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అర్పనపల్లి సమీపంలోని వట్టివాగుకు ఎస్ఆర్ఎస్పీ జలాలు చేరి కళకళలాడుతోంది. కేసముద్రం మండలాల్లో ప్రవహిస్తున్న వట్టివాగుకు శ్రీరాం సాగర్ ప్రాజెక్టు (ఎస్ఆర్ఎస్పీ) జలాలు అందించడాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ చర్యలు చేపట్టారు. గత నెల 7న 'విలవిల..ఎండిపోయిన వట్టివాగు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో పతాక కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఎమ్మెల్యే మరుసటి రోజునే ఎస్ఆర్ఎస్పీ తీగరాజుపల్లి నుంచి కేసముద్రం, నెల్లికుదురు మండలాల వరకు డీబీఎం 48 ప్రధాన కాల్వ, ఉపకాల్వలను పరిశీలించారు. వట్టివాగులోకి నీటిని విడుదల చేసే కార్యక్రమాన్ని నెల నుంచి చేపడుతున్నారు. రైతులు వాగులో తవ్వుకున్న తాత్కాలిక బావులు, చెక్‌డ్యాంలు అన్నీ నిండి వారం క్రితమే అర్పనపల్లి వంతెన వద్దనున్న చెక్‌డ్యాం పూర్తిగా మునిగిపోయేంత జలాలు రావడం విశేషం. దీంతో వట్టివాగు వెంట ఆయా గ్రామాల్లో మొక్కజొన్న, వరి పంటలకు సాగునీటి కొరత తీరినట్లేనని పలువురు రైతులు చెబుతున్నారు. ఎస్ఆర్ఎస్పీ జలాలను వట్టివాగులోకి విడుదల చేసి పంటలను కాపాడినందుకు ప్రభుత్వానికి ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న ధన్యవాదాలు తెలిపారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2121	2100
పల్లికాయ (సూక)	7700	6500
పల్లికాయ (పచ్చిది)	4250	3400
కందులు	6789	5540
పెసళ్లు	7703	4645
పత్తి	7025	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	13200	9000
డిడి	-	-
వండర్‌హాట్	14800	11500
ఎల్లో మిర్చి	-	-
యూఎస్341	12800	9500
దేశీ	27500	25500
సింగిల్‌పట్టి	30000	28000
దీపిక	15800	15245
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

ముందుంది.. నీటి ముప్పు!

రోజురోజుకు అడుగంటుతున్న భూగర్భ జలం

- విచ్చలవిడి వాడకం, యథేచ్ఛగా బోర్ల తవ్వకంతో జటిలం
- కానరాని ఇంకుడు గుంతలు
- పట్టించుకోని కార్పొరేషన్, మున్సిపాలిటీలు

నేడు ప్రపంచ జల దినోత్సవం



హనుమకొండ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మానవాళి మనుగడలో నీటి అవసరత ఎంతో తెలిసిందే. ప్రపంచ ప్రపంచవ్యాప్తంగా 2.50బిలియన్ల మంది ప్రజలు తమ ప్రాథమిక రోజువారీ నీటి అవసరాలను తీర్చుకునేందుకు పూర్తిగా భూగర్భ జల వనరులపై ఆధారపడుతున్నారు. మనిషి జీవితంలో ఎంతో ప్రాముఖ్యం కలిగిన ఈ భూగర్భ జలాల పరిరక్షణ విషయంలో ప్రజలు, ప్రభుత్వాలు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. భూగర్భ జలాలను విచ్చలవిడిగా తోడుతుండడం వల్ల సమస్య రోజురోజుకు జటిలమవుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. గతంలో భూగర్భ జలాలు అతి తక్కువ లోతులోనే లభ్యమయ్యేవి. ప్రస్తుతం అత్యధికంగా భూగర్భ జలాలను వాడుకోవడం వల్ల దిగజారుతున్నాయి. ఇవి ప్రమాద స్థాయికి పడిపోక ముందే వాటి స్థాయిలను పెంచాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ఇంకుడు గుంతల ద్వారా వృథా నీటిని ఒడిసిపట్టకపోతే ముందుముందు ప్రమాద ఘంటికలు తప్పవన్న హెచ్చరిస్తున్నారు. శనివారం ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో నీటి వినియోగం, భూగర్భ జల నీటి మట్టాల పరిస్థితిపై కథనం.

నీటి సంరక్షణకు చర్యలు

నీటి సంరక్షణకు చర్యలు తీసుకున్నప్పుడే మానవాళి మనుగడ. లేకుంటే నీటి కొరత ఏర్పడి తాగు, సాగునీటికి అనేక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుంది. ప్రధానంగా భూగర్భ జల మట్టాలు పడిపోకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది. భూగర్భ జలవనరులను పెంచడానికి, వాన నాటిని సంరక్షించడానికి ఇంకుడు గుంతలు, చెక్ డ్యాములు, రీచార్జి స్ట్రక్చర్స్ కట్టాలి. వాటర్ రీచార్జి స్ట్రక్చర్లు, సోపిట్లు విస్తృతంగా నిర్మించాలి. కృత్రిమ వనరుల ద్వారా వచ్చిన నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెంపునకు చర్యలు తీసుకోవాలి. బండలు ఉన్న ప్రాంతాల్లో నీరు భూమిలోకి ఇంకనప్పుడు అలాంటి చోట్ల చెక్ డ్యాంలను నిర్మించడం ఒక్కటో ప్రత్యామ్నాయం. భూగర్భ జలాల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు ద్వారా మ్యాపింగ్ చేయాలి. వాల్టా చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి. కొత్తగా చేపట్టిన లే ఔట్లలో 10 శాతం గ్రీనరీ, సోపిట్స్ లేకుండా అనుమతులు ఇవ్వరాదు. కొత్తగా కట్టే ఇళ్లకు సోపిట్స్ ఉంటేనే అనుమతులు ఇవ్వాలి. వాన నీటిని ఒడిసిపట్టేలా ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి.

ఇంకుడుగుంతల జాడేది ?

వరంగల్ నగర పాలక సంస్థతో పాటు ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది మున్సిపాలిటీల పరిధిలో భూగర్భ జలాలు అడుగంటే పలు కాలనీల్లో గుంతలు, వాననీటి సంరక్షణ చర్యలు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఏటా ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో ఇంకుడు గుంతల నిర్మాణ పనులు చేపట్టాలి. కానీ ఇక్కడ పట్టించుకునేవారే కరువయ్యారు. కార్పొరేషన్ పరిధిలో అప్పట్లో 200 అడుగు లోతుల్లోనే పుష్కలంగా నీరు ఉండేది. ప్రస్తుతం వెయ్యి అడుగుల లోతున తవ్వితే కానీ బోర్లలో నీటి చుక్క జాడ కనిపించడం లేదు. ప్రతి ఇంట్లో నిత్యావసరాలకు ఉపయోగించే నీటికంటే వృథాగా పోయే నీరే ఎక్కువ. వృథాగా పోయే నీటిని ఒక చోటికి చేర్చితే భవిష్యత్ తరాలకు నీటి సమస్య తలెత్తకుండా ఉంటుందని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. వ్యక్తిగతంగానే కాకుండా ప్రతీ ఒక్కరూ సామాజిక పరంగా ప్రజల్లో అవగాహన చేపట్టి భారీ ఎత్తున ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టగలిగే ప్రయత్నం చేస్తే సరైన ప్రతిఫలం పొందగలుగుతామని జల నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



హనుమకొండ జిల్లాలో...

హనుమకొండ జిల్లాలో భూగర్భ జలాలు కాస్త తక్కువ స్థాయిలో పడిపోయాయి. గతేడాది ఫిబ్రవరిలో ఉన్న భూగర్భజల మట్టాలతో పోల్చితే ఈ ఏడాది ఫిబ్రవరిలో సగటున 0.09 మీటర్ల తోతుకు, అలాగే పరకాల డివిజన్ పరిధిలో 0.85 మీటర్ల లోతుకు పడిపోయాయి. భీమదేవరపల్లి మండలంలో భూగర్భజలాలు వేగంగా పడిపోతున్నాయి. ఈ మండలంలో ఇప్పటికే 2.81 మీటర్లు పడిపోయాయి, ధర్మసాగర్ మండలంలో 0.92 మీటర్లు, ఎల్కతుర్తి మండలంలో 0.89 మీటర్లు, హనుమకొండ మండలంలో 0.91 మీటర్లు, కమలాపూర్ మండలంలో 2.12 మీటర్ల లోతుకు, వేలేరులో 0.42 మీటర్లు, ఐనవోలు 2.02 మీటర్ల లోతుకు పడిపోయాయి. రానున్న రోజుల్లో ఈ నీటి మట్టాలు మరింత తోతుకు వెళ్లే అవకాశాలున్నట్టు నిపుణులు చెబుతున్నారు. ఒక్క హసన్‌పర్తి మండలంలో మాత్రం ఇందుకు భిన్నంగా నీటి మట్టాలు 0.79మీటర్లు పెరిగాయి. ఇందుకు కారణం ఈ మండలంలో పెద్ద చెరువు ఉండడం వల్ల భూగర్భ జలాలు స్థిరంగా ఉన్నాయి. భద్రకాళి చెరువును ఖాళీ చేయడంతో దాని ప్రభావంతో చుట్టు పక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు 0.92 మీటర్ల మేరకు తగ్గినట్టు తేలింది. ఇంతకు ముందు ఈ ప్రాంతాల్లో ఎంత ఎండలు కొట్టిన భూగర్భ జలమట్టాలు స్థిరంగా ఉండేవి. ఉమ్మడి జిల్లాలోని పెద్ద చెరువులున్న ప్రాంతాల్లో భూగర్భ జల మట్టాలు స్థిరంగా ఉంటున్నాయి. ఈ చెరువుల నీటిని ఇష్టారాజ్యంగా వాడడం వల్ల అవి ఖాళీ అయి దాని ప్రభావం భూగర్భ జలమట్టాలపై పడుతోంది.

సేఫ్‌జోన్లు

భూగర్భ జలమట్టాలు ఆందోళనకర స్థాయిలో పడిపోతుండడంతో వాటిని సేఫ్ జోన్లుగా, సెమిక్రిటికల్, క్రిటికల్, ఓవర్ ఎక్స్‌ప్లాయిడ్ జోన్లుగా విభజించారు. మహబూబాబాద్‌లో 15 సేఫ్ జోన్లు, ఒకటి సెమి క్రిటికల్ జోన్లు ఉండగా, హనుమకొండ జిల్లాలో 10 సేఫ్ జోన్లు, 4 సెమి క్రిటికల్ జోన్లు ఉన్నాయి. వరంగల్ జిల్లాలో 13 సేఫ్ జోన్లు , జనగామలో 11 సేఫ్, ఒక సెమీ క్రిటికల్ జోన్లు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 11 సేఫ్ , ఒక సెమీ క్రిటికల్, ములుగు జిల్లాలో 9 సేఫ్ జోన్లు ఉన్నాయి. భూగర్భ జలాలను అతిగా వాడుకుంటున్న ప్రాంతాలు లేవు.

ఫిజియోమీటర్ల సంఖ్య పెంచాలి

ఉమ్మడి జిల్లాలో భూగర్భజల మట్టాలను కొలిచే పీజియోమీటర్లు చాలినన్ని లేవు. పెరుగుతున్న జనాభ, పట్టణ విస్తరణను దృష్టిలోపెట్టుకొని వీటి సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉంది. ప్రస్తు తం మహబూబాబాద్‌లో 65, ములుగులో 50, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 46, వరంగల్‌లో 31, హనుమకొండలో 22 జనగామలో 37 ఉన్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా..!

ఇంటి నిర్మాణ అనుమతులు ఇచ్చే ముందు ఇంకుడుగుంత నిర్మించాలనే నిబంధన ఉన్నా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా రు. వర్షపు నీరు వచ్చే దిగువ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలు, పార్క్ స్థలాల్లో ఇంకుడుగుం త నిర్మాణం చేపట్టేలా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికు లు కోరుతున్నారు. నగరంలో, దాని చుట్టుపక్క ల ప్రాంతాల్లో నిర్మాణాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. ప్రధానంగా గేటెడ్ కమ్యూ నిటీ అపార్టుమెంట్లు, విల్లాల నిర్మాణా లు జోరుగా సాగుతున్నాయి. చాలా మంది బిల్డర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదు. నిర్మాణ సమయంలోనే ఇంకుడుగుంత నిర్మిం చాలనే నిబంధనలను ఏ మాత్రం పట్టించు కోవడం లేదు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో భూగర్భ జలాలు సగటున ఒకటి నుంచి ఒకటిన్నర మీటర్ల మేర పడిపోయాయి. ఇప్పుడే ఇవి ఇంతగా దిగజారితే ఏప్రిల్, మే, జూన్‌నెలలో మరింతెగా పడిపోతాయోననే ఆం దోళన కలుగుతోంది. హనుమకొండ జిల్లా పరి ధిలో భూగర్భ జల నీటి మట్టాలు కాస్త తక్కు వ స్థాయిలోనే పడిపోగా వరంగల్, జనగామ, మహబూబాబాద్ జిల్లాలో ఆందోళన కర స్థాయిలో పతనమవుతున్నాయి.

ట్రాలీలో ప్రయాణాలు గాలిలో ప్రాణాలు..

సరుకులు తరలించే వాహనాల్లో ప్రజల ప్రయాణం

కూలి పనుల కోసం మనుషుల చేరవేత

- నిబంధనలను పట్టించుకోని వాహన యజమానులు
- ప్రజలే స్వీయ జాగ్రత్త పాటించాలంటున్న ఆర్‌టీఏ అధికారులు
- ఓవర్‌లోడ్‌తో అదుపుతప్పి ప్రమాదాలు



వాజేడులో మహిళా కూలిలతో వెళ్తున్న వాహనం

వరంగల్ క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పది మంది కలిసి ప్రయాణం చేయాలనుకుంటే చాలు.. గ్రామాల్లో అందుబాటులో ఉండే గూడ్స్ వాహనాలను కిరాయి తీసుకొని వెళుతున్నారు. సరుకులను తరలించే వాహనాల్లో పరిమితికి మించిన లోడ్‌తో మనుషులు వెళ్తూ ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. గూడ్స్ వాహనాల్లో మనుషులను తరలించొద్దనే నిబంధనలు ఉన్నప్పటికీ వాహన యాజమానులు, డ్రైవర్లు ఖాతరు చేయకుండా సరుకుల మూటల లెక్క ఒకరి మీద ఒకరిని కుక్కి ఎక్కించి నిర్లక్ష్యంగా వాహనాలను నడుపుతున్నారు. ఫలితంగా ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ప్రమాదం నుంచి బతికి బయటపడ్డోళ్లు జీవితాంతం అంగవైకల్యంతో బాధపడుతూ కాలం వెళ్లదీస్తున్నారు. వాహన యాజమానులు కేసుల పాలవుతున్నారు. అంతిమంగా గూడ్స్ వాహనాల్లో ప్రయాణించే వారితోపాటు వాహన యాజమానులు జీవితాలు ఛిన్నాభిన్నమై రోడ్డున పడుతున్నాయి.

వ్యవసాయ కూలీలు

గ్రామాల్లో వ్యవసాయ పనుల కోసం కూలీల కొరత ఉంటుండటంతో ఆయా పనుల కోసం రైతులు ఇతర ప్రాంతాల్లో ఉన్న కూలీలపై ఆధారపడుతున్నారు. ఒకేసారి పదుల సంఖ్యలో కూలీలను తరలించడానికి ట్రాలీ ఆటోలను కిరాయికి మాట్లాడుకుంటున్నారు. ట్రాలీ యాజమానులు సైతం కూలీలను ఎక్కువ సంఖ్యలో తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో ఓవర్ లోడ్‌తో వాహనం అదుపుతప్పుతూ ప్రమాదాలు జరిగి ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. కూలీలు ఒక్కరే కాకుండా శుభకార్యాలకు, జాతరలకు వెళ్లే క్రమంలో సైతం ట్రాలీఆటోలు, ట్రాక్టర్లను ప్రజలు ఆశ్రయించడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు.

కనిపించని తనిఖీలు

ఉమ్మడి వరంగల్ జిల్లాకు కలిపి ఒకే ఒక్క ఆర్‌టీవో ఉన్నప్పుడైనా రోడ్లపై ఆర్‌టీఏ అధికారులు తనిఖీలు కనిపించేది. పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లాలు ఏర్పాటుచేసి జిల్లాకో అధికారిని నియమించినప్పటికీ తనిఖీల ఊసే లేకుండా పోయింది. వరుస ఘటనలు జరిగినప్పుడైనా మెరుపు దాడులతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించేదని, ఇప్పుడు అలాంటి తనిఖీలు కూడా ఉండటం లేవని పలువురు అభిప్రాయపడుతున్నారు. కేవలం ఉన్నతాధికారులు ఇచ్చే టార్గెట్ ప్రకారం రోజుకు ఒకటి రెండు కేసులు నమోదు చేసి కార్యాలయాలకు మాత్రమే పరిమితమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాదాల నివారణపై ఎలాంటి అవగాహన కార్యక్రమాలు సైతం వాహనదారులు, ప్రజలకు కల్పించడం లేదనే అపవాదు ఆర్‌టీఏ అధికారులపై ఉంది.

ఇటీవల జరిగిన ప్రమాదాలు

- జనవరి 27న హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం మునిపల్లి గ్రామంకు చెందిన 22మంది కూలీలు ట్రాలీ ఆటోలో కమలాపూర్ మండలం వంగపల్లికి వ్యవయసాయ పనుల కోసం వెళ్లారు. తిరిగి సాయంత్రం వస్తున్న క్రమం లో గూడూరు-అంబాల మధ్య ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును వేగం ఢీకొట్టింది. ఈ ఘటనలో హుస్సేన్‌బీ (50) మృతిచెందగా, 16 మంది కూలీలు తీవ్రంగా గాయపడ్డారు.
- మార్చి 6న వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం కోనాపురం శివారులో జరిగిన ప్రమాదంలో టాటా ఏసీ వాహనంలో ప్రయాణిస్తున్న జీడిగడ్డ తండాకు చెందిన 31 మంది మహిళలు, 6 పురుషులు కలిపి మొత్తం 37 మంది వ్యవసాయ కూలీల్లో బానోతు సుక్క (55) మరణించగా, ఎంజీఎంలో చికిత్స పొందుతూ బానోతు ఈర్యా (52) మృతి చెందాడు. సుమారు 20పైగా మంది కూలీలు గాయపడ్డారు.
- మార్చి 8న ఏటూరునాగారం మండలం రాంనగర్ వద్ద కూలీలను తరలిస్తున్న గూడ్స్ వాహనం బోల్తాపడి 15 మంది కూలీలు తీవ్రంగా గాయపడ్డారు.
- మార్చి 12న హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరు గ్రామానికి చెందిన 30మంది వ్యవసాయ మహిళా కూలీలు మిరపకాయలు తెంపేందుకు పరకాల మండలంలోని మల్లక్కపేటకు వస్తుండగా నడికూడ శివారులో ట్రాలీ బోల్తాపడి కూలీలు తీవ్రంగా గాయపడగా చికిత్స కోసం ఎంజీఎంకు తరలించారు.
- మార్చి 21 శుక్రవారం తొర్రూరు మండలంలోని ఫత్తేపురం, చర్లపాలెం గ్రామాలకు చెందిన 17మంది మహిళా కూలీలు మరిపెడ మండలంలో వ్యవసాయ పనులకు వెళ్తుండగా లారీ ఢీకొనడంతో చర్లపాలెంకు చెందిన అరుణ (40) మృతిచెంద గా, మిగతా కూలీలు గాయపడ్డారు.



చెన్నారావుపేట మండలం కోనాపురంలో వాహనం అదుపుతప్పిన ప్రమాదంలో గాయపడిన కూలీలు (ఫైల్)

గూడ్స్ వాహనాల్లో ప్రయాణించొద్దు..

గూడ్స్ వాహనాల్లో ప్రజలు ప్రయాణాలు చేయొద్దు. గూడ్స్ వాహనాలు సరుకులు తరలించేలా నిర్మాణం చేస్తారు కనుక మనుషులు కూర్చునేందుకు ఇబ్బందిగా ఉంటుంది. గూడ్స్ వాహనాల్లో ప్యాసింజర్స్‌ను తరలించడం నిబంధనలకు విరుద్ధం. అలాంటి వాహనాలు సీజ్‌చేసి జరిమానా విధిస్తున్నాం. రోడ్లపై తనిఖీలు చేస్తున్న సమయంలో గంటల కొద్దీ వేచి చూస్తున్నారు. కొన్ని సందర్భాల్లో కూలీలను చూసి మానవతా దృక్పథంతో చూసీచూడనట్లుగా వదిలేయాల్సి వస్తోంది. ప్రజలే స్వీయ జాగ్రత్తలు పాటిస్తూ గూడ్స్ వాహనాలకు దూరంగా ఉండాలి.

- వేణుగోపాల్, రవాణా శాఖ హనుమకొండ జిల్లా అధికారి

'బంగినపల్లి'కి రికార్డు ధర

- లక్ష్మీపురం మార్కెట్‌లో క్వింటా రూ.10,200
- హర్షం వ్యక్తం చేస్తున్న మామిడి రైతులు



మంత్రి సురేఖ, ఎమ్మెల్యే నాగరాజు, కలెక్టర్ సత్యశారద సమక్షంలో వేలం పాడుతున్న దృశ్యం (ఫైల్)



మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన మామిడికాయలు

వరంగల్ వ్యవసాయం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): బంగినపల్లి మామి డి భలే ధర పలుకుతోంది. వరంగల్ లక్ష్మీపురం పండ్ల మార్కెట్‌కు నాలుగు రోజులుగా ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి రైతులు కాయల ను అమ్మకా నికి తెస్తున్నారు. ఈ క్రమంలో రోజుకు రెండు నుంచి ఐదు టన్నుల వరకు పంట వస్తుండగా.. సీజన్ ప్రారంభ దశ కావడంతో ధరలు మా త్రం అంచనాకు మించి పలుకుతు న్నాయి. ఈ మా ర్కెట్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గురువారం బంగినపల్లి మామిడికాయ టన్నుకు రూ.లక్షా 22వేలు పలికింది. అంటే కిలో మామిడికాయలకు రూ.122 అన్నమాట. ఇది ఈ మార్కెట్ చరిత్రలోనే రికార్డు ధర. గత సోమవారం సీజన్ ప్రారంభం మొదటి రోజు క్వింటా ధర రూ.10500 పలికింది. బుధవారం నాడు టన్ను రూ.70వేలు, శుక్రవారం లక్షా రెండు వేల రూపాయలు పలికింది.

సీజన్ ప్రారంభంలో అధిక ధరలే...

మామిడి సీజన్ ప్రారంభ దశలో ఉన్నప్పుడు అధిక ధరలు ఉండడం మామూలే. కానీ మరీ టన్నుకు లక్షా 22వేల ధర పలకడం రికార్డే. ము న్ముందు వందల టన్నుల పంట వస్తే ధరలు అమాంతం పడిపోతాయి. వరంగల్ జిల్లాలో 6500 ఎకరాలు, హనుమకొండ జిల్లాలో 5500 ఎకరాల్లో రైతులు మామిడి సాగు చేస్తున్నా రు. అయితే గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది పంట దిగుబడి తక్కువగా ఉన్నట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పూత, పిందె దశలో పురుగు ఆశించి పంట నష్టం ఎక్కువగా జరిగినట్టు చెబుతున్నారు. మరి కొద్ది రోజులు పోతే కానీ ఎకరానికి ఎంత దిగుబడి వస్తుందనేది అంచనా వేయలేమని అంటున్నారు. ప్రస్తుతం మార్కెట్లో పలికే ధరలకు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం మామిడి సీజన్‌లో మొత్తం లక్షా 30 వేల క్వింటాళ్ల మామిడికాయలు అమ్మకానికి రాగా మార్కెట్‌కు ఫీజు రూపంలో రూ.40లక్షల ఆదాయం వచ్చింది.

సొమ్ములిస్తే చాలు!

5వ పేజీ తరువాయి

గండి పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. ఇక లింకు పేపర్లు లేకపోతే డాక్యు మెంట్‌కు అదనంగా రూ.5వేల నుంచి రూ.20వేల వరకు ఇచ్చుకోవాల్సిందేనట. వీటితో పాటు వివాదస్పద భూములు, కోర్టు కేసుల్లో ఉన్న భూ ములు, అసైన్డ్, ప్రభుత్వం భూములయితే ఏరి యాను బట్టి రూ.20వేల నుంచి రూ.2లక్షల వర కు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తు న్నాయి. వెంచర్ల ప్లాట్ రిజిస్ట్రేషన్‌కు వస్తే గజాని కి రూ.200 వరకు వసూలు చేస్తున్నారట. ఇలా ఎవరు ఎంత ఎక్కువ చెల్లిస్తే వారి రిజిస్ట్రేషన్ చకాచకా చేసేస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది.

రైటర్లు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ద్వారా వసూళ్లు..

హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో ఉన్న కొన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొందరు డాక్యుమెం ట్ రైటర్లు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు, ప్రైవేట్ సిబ్బంది దళారులుగా అవతారమెత్తి వసూళ్లకు దిగుతున్నారనే ప్రచారం జరుగుతోంది. డాక్యుమెం ట్ రైటర్లు పత్రాల తయారీ ఖర్చులతో పాటు సబ్‌రిజిస్ట్రార్లకు ఇవ్వాల్సిన మాముళ్ల లెక్క కూడా ఈ డాక్యుమెంట్ రైటర్ ఆఫీసుల్లోనే కుదురుతుం దనే ఆరోపణలున్నాయి. డాక్యుమెంట్ రైటర్లు నేరుగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లోకి వెళ్లి రిజిస్ట్రే షన్ చేసే వరకు అన్నీ దగ్గరుండి చూసుకుంటు న్నారనే చర్చ ఉంది. గతేడాది ఏడాది జూలై 26వ తేదీన హనుమకొండ జిల్లా పరకాల సబ్‌రిజిస్ట్రార్ సునిత 1,173గజాల భూమిని గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసేందుకు డాక్యుమెంట్ రైటర్ నరేష్ ద్వారా రూ.80వేల తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. దీంతో సబ్‌రిజిస్ట్రార్‌లకు, డాక్యుమెం ట్ రైటర్లకు మధ్య వసూళ్ల బాగోతం బయట పడింది. ఇక వీరితో పాటు ఔట్‌సోర్సింగ్ ద్వారా తమ వారిని కంప్యూటర్ ఆపరేటర్లుగా, ఆఫీసు బాయ్‌లుగా, స్వీపర్లుగా కార్యాలయాల్లో పెట్టుకుని కొందరు ఎస్‌ఆర్‌వోలు వసూళ్లకు దిగుతున్నారనే ప్రచారం జరుగతోంది. గతేడాది మార్చి 22న మహబూబాబాద్ సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా 128గజాల ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వెంకటేశ్ ద్వారా రూ.19,200లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. వీటితో పాటు ఎలాం టి లెక్కలు లేని రూ.1.72లక్షల కూడా ఏసీబీ అధికారులకు లభించాయి. ప్రైవేటు వ్యక్తులను కార్యాలయాల్లో దళారులుగా నియమిస్తూ వసూళ్ల కు పాల్పడుతున్న ఉదంతాలు కూడా వెలుగులోకి వస్తున్నాయి. గురువారం జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్ సబ్‌రిజిస్ట్రార్ రామకృష్ణ ఇంటి రిజిస్ట్రేషన్ కోసం రూ.18వేల డిమాండ్ చేసి, తన ప్రైవేట్ అసిస్టెంట్ రమేష్ ద్వారా లంచం తీసు కుంటు ఏసీబీకి పట్టుబడ్డారు. ఇలా సబ్‌రిజిస్ట్రార్లు తమకు అనుకూలంగా ఉన్న ప్రైవేటు వ్యక్తులు, డాక్యుమెంట్ రైటర్లు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ద్వారా మాముళ్ల పర్వాన్ని కొనసాగిస్తున్నారనే ఆరోపణలకు బలం చేకూర్చుతున్నాయి.

పట్టుబడుతున్నా.. పట్టింపులేదు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం ఉంది. వీటిలో ప్రతి రోజు వందల సంఖ్యలో రిజి స్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఏడాది కాలంగా 12 మంది సబ్‌రిజిస్ట్రార్లలో ముగ్గురు ఏసీబీ అధికా రులకు పట్టుబడటం రిజిస్ట్రేషన్ శాఖలో అవినీతి ఏమేరకు జరుగుతుందో తెలియ జెబుతోంది. గతేడాది మార్చి 22న మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా, జూలై 26వ తేదీన పరకాల సబ్‌రిజిస్ట్రార్ సునిత, ఈ నెల 20వ తేదీన స్టేషన్ ఘనపూర్ సబ్‌రిజిస్ట్రార్ రామకృష్ణ అవినీతి నిరో దకశాఖ అధికారులు పట్టుబడ్డారు. అయినా కొంతమంది సబ్‌రిజిస్ట్రార్లలో మార్పు రావటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జీతం కంటే గీతంపైనే ఎక్కువ మంది ఆధారపడుతున్నారని, మాముళ్లను మాములుగానే తీసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అవినీతికి ఆనవాళ్లుగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు నిలుస్తున్నాయని, ఏ సీబీ అధికారులు మరింత నజర్ వేసి అక్రమా ర్కుల ఆట కట్టించాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడలతో మానసిక స్థైర్యం : ప్రొఫెసర్ వల్లూరి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ప్రిన్సిపాల్ మనోహర్

కేయూ క్యాంపస్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): క్రీడల తో విద్యార్థులతో మానసిక స్థైర్యం, వికాసం పెరుగు తోందని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం అన్నారు. శుక్రవారం కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం నేతృత్వంలో క్యాంపస్ కళాశాల పీజీ స్టూడెంట్స్‌కు టోర్నమెంట్ నిర్వహించా రు. ఈ సందర్భంగా క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, క్యాంపస్ కళాశాల పీడీ డాక్టర్ పి. కుమారస్వామి నేతృత్వంలో జరిగిన ఈ క్రీడలను రామచంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేయూ క్యాంపస్ కళాశాల వైస్ ప్రిన్సి పాల్ డాక్టర్ మమత, హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్య, పీడీ కుమారస్వామి, క్రీడాకారులు పాల్గొన్నారు. ఇదిలాఉంటే కేయూ క్రీడామైదానంలో శనివారం జరిగే క్రికెట్ ఫైనల్ పోటీల్లో రాజనీతి శాస్త్రం, కంప్యూటర్ సైన్స్ విభాగాల జట్లు తలపడను న్నాయి. 24 నుంచి ట్రాక్ అండ్ ఫీల్డు అథ్లెటిక్స్ క్రీడాంశాలల్లో పోటీలు జరగనున్నట్టు కేయూ ఫిజికల్ డైరెక్టర్ శేషాల కుమార్ తెలిపారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు ప్రారంభం

కాటారం, మార్చి 21(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కాటారం జడ్పీహెచ్ఎస్, గిరిజన సంక్షేమ బాలుర గురుకులం, ఆదర్శ హైస్కూల్ పరీక్షా కేంద్రాల్లో విద్యారులు మొ దటి రోజున తెలుగు పరీక్షను రాశారు. జడ్పీహెచ్ఎస్‌లో 198మందికి గానూ 198 మంది, గిరిజన గురుకులంలో 210మందికి గానూ 210మంది, ఆదర్శ విద్యాలయం పరీక్ష కేంద్రంలో 210మందికి గానూ207మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని ఆయా కేంద్రాల చీఫ్ సూపరిండెంట్లు రాజేందర్, సాదిఖ్, పురుషోత్తంరెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి, ఎస్సై మ్యాక అభినవ్, ఎంపీడీవో అడ్డూరి బాబు సందర్శించారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం కేంద్రాలను తనిఖీ చేశారు. వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది క్యాంపు లు ఏర్పాటు చేయగా సివిల్, టీజీఎస్పీ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

● వెంకటాపూర్ : మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పరీక్ష కేంద్రంలో ఏర్పాటుచేసిన పదోతరగతి వార్షిక పరీక్షలు తొలిరోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. పరీక్ష కేంద్రానికి 182మంది విద్యార్థినీవిద్యార్థులు హాజరై పరీక్షలు రాయగా 13మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వర్తించారు.

● మొగుళ్లపల్లి : మండలంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పదోతరగతి వార్షిక పరీక్షలు తొలిరోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. మొగుళ్లపల్లి జడ్పీహెచ్ఎస్ కేంద్రంలో 170మంది, మొట్లపల్లి జడ్పీహెచ్ఎస్ పరీక్ష కేంద్రంలో 96మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.

● మహాముత్తారం : మహాముత్తారం మండలంలోని హైస్కూల్‌లో జరిగిన పది పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 154 మంది విద్యార్థులు పరీక్షలు హాజరుకావల్సి ఉండగా 153మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఒక్క విద్యార్థి మాత్రం పరీక్షలకు గైరాజరయ్యారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.



మహాముత్తారంలో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

బాధిత రైతులకు పరిహారం అందజేత

వాజేడు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మృతిచెందిన పశువులకు విద్యుత్‌శాఖ తరఫున వచ్చిన నష్టపరిహారాన్ని శుక్రవారం ఏఈ అర్షద్‌అహ్మద్ అందజేశారు. 2022సంవత్సరంలో కడేకల్, కృష్ణాపురం గ్రామాలకు చెందిన పూనెం ఏసుపతికి రూ.40వేలు, బుర్కసాలయ్యకు రూ.80వేల నష్టపరిహారం రాగా బాధిత రైతులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నూగూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పూనెం రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల చట్టాలపై అవగాహన

మహాముత్తారం, మార్చి21(ఆంధ్రజ్యోతి): మండలంఓని రేగులగూడెం, బోర్లగూడెం గ్రామాలలోని అంగన్‌వాడి కేంద్రాలలో మహిళ చట్టాలపై అవగహన కోసం శుక్రవారం సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సుకన్య సమృద్ధియోజన, బేటిబచావో, బేటి పఢావో, మిషన్ వాత్సాల్యా, చైల్డ్ హెల్ప్‌లైన్,, బాల్యవివాహాలు,చైల్డ్ హెల్ప్‌లైన్, సఖీ సెంటర్‌కు మహిళలకు వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, చైల్‌హెల్ప్‌లైన్ అధికారి కళావతి, మిషన్ శక్తి కోఆర్డినేటర్ అనుషా, మమత, సఖీ సరిత, అంగవ్వాడి టీచర్స్ జయప్రద పాల్గొన్నారు.

తాగుబోతులకు సామాజిక సేవా శిక్ష

ములుగు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడిపిన మందుబాబులకు ములుగు కోర్టు కనువిప్పు కలిగే శిక్ష విధించింది. ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్ టెస్టులలో పట్టుబడిన 13మంకి ములుగు సబ్‌కోర్టు జడ్జి కన్నయ్యలాల్ జరిమానా విధించడంతోపాటు నాలుగు గంటలపాటు సామాజిక సేవ చేయాలని ఆదేశించారు. ఈక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో వారిచేత శుక్రవారం ములుగు ప్రభుత్వ ఏరియా వైద్యశాల పరిసరాలలో చెత్తను తొలగింప జేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్న వారిలో పరివర్తన తెచ్చేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

పరీక్ష కేంద్రంలో వైద్య శిబిరం

మహదేవపూర్, మార్చి 21(ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ సుష్మిత తెలిపారు. పరీక్ష కేంద్రానికి వచ్చే విద్యార్థులు ఎవరైనా అస్వస్థతకు గురైతే వెంటనే వైద్యం అందించేందుకు గాను ఈ వైద్య శిబిరం ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు.

మాదకద్రవ్యాల నిరోధానికి కృషి చేయాలి

- నిరోధక కమిటీ సమావేశంలో కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సమాజానికి పెను సవాల్‌గా మారిన మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధానికి ఆయా శాఖల అధికారులు కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. శుక్రవారం కలెక్టర్ తన చాంబర్‌లో జిల్లాస్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాల వినియో గం, రవాణాపై ఉక్కుపాదం మోపేందుకు అధికారులు సమన్వయంతో మరింత గట్టిగా పనిచేయాలని తెలిపారు. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల సరిహ ద్దు మార్గం ద్వారా వీటిని రవాణా చేసే అవకాశాలు ఉన్నందున అధికా రులు అవసరమైన చర్యలు చేపట్టాలని, తనిఖీ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఉంచాలన్నారు. ఈదిశగా పోలీస్, ఎక్సైజ్, రవాణా, తదితర శాఖలు సమన్వయంతో ముందుకెళ్లాలని అన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు వాడినట్లు దృష్టికి వస్తే 1908 టోల్‌ఫ్రీ నంబ ర్‌కు తెలియజేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో వెంకటేష్, డీసీఆర్‌బీ డీఎస్పీ కిషోర్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్ పోలీస్(నా ర్కోటిక్స్) సైదులు, ఎక్సైజ్ ప్రొబేషన్ అధికారి శ్రీనివాస్, వ్యవసాయశాఖ అధికారి సురేష్‌కుమార్, జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీనివాస్, వాణిజ్య పన్నులశాఖ అధికారి దుర్గేశ్వర్, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మణ్, బీసీ, మైనారిటీ సంక్షేమశాఖల అధికారి రవీందర్, జిల్లా ఇంటర్ విద్యాశా ఖ అధికారి చంద్రకళ, విద్యాశాఖ కోఆర్డినేటర్ సాంబయ్య, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ పోచం, కలెక్టరేట్ పర్యవేక్షకులు మహేష్‌బాబు, తదితరశాఖల అధికారులు పాల్గొన్నారు.

వార్షిక గన్ ఫైరింగ్ ప్రాక్టీస్!

కృష్ణకాలనీ, మార్చి 21 (ఆంధ్ర జ్యోతి): వరంగల్ మామునూరు బెటాలియన్ వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్‌లో జిల్లా పోలీసులు పాల్గొన్నారు. భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరేతో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని పిస్టల్, ఏకే47, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్, వివిధ ఆటోమేటిక్ వెపన్ల ఫైరింగ్ సాధన చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బోనాల కిషన్, ఏఆర్ అదనపు ఎస్పీ శ్రీనివాస్, డీఎస్పీలు సంపత్‌రావు, నారాయణ నాయక్, జిల్లా పరిధిలోని సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఫైరింగ్ చేస్తున్న భూపాలపల్లి ఎస్పీ, ఇతర పోలీస్ అధికారులు

ఆయుష్ ఆస్పత్రిలో నర్సింగ్ విద్యార్థుల తరగతులు

భూపాలపల్లి కలెక్టరేట్ : నర్సింగ్ విద్యార్థులకు తరగతుల నిర్వహణకు తాత్కాలికంగా ఆయుష్ ఆస్పత్రి భవనాన్ని వినియోగించుకోవడానికి అవకాశం కల్పించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం కలెక్టరే ట్‌లో వైద్యఆరోగ్యశాఖ, నర్సింగ్, ఆయుష్, సిహెచ్‌సీ, టీజీఎంఎస్ ఐడిసి ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయుష్ ఆస్పత్రి భవనంలోని రెండు అంతస్థులను నర్సింగ్ కాలేజీ నిర్వహణకు కేటాయించాలన్నారు. జీజీహెచ్, జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి సర్దుబాటుచేసి కళాశాల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ, డిఎంహెచ్ఓ మధుసూదన్, జీజీహెచ్ సూపరిటెండెంట్ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

వడదెబ్బ తగలకుండా చూడాలి

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అన్నిశాఖల అధికారుల తో సమావేశం నిర్వహించిన అదనపు కలెక్టర్ వడ దెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీ క్షించారు. వేసవిలో చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవా లన్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. అత్యవసర సేవలకు 102,108 సేవలను వినియోగిం చుకోవాలన్నారు. డీఎంహెచ్ఓ మధుసూదన్, జీజీహెచ్ నవీన్‌కుమార్, డిపిఓ నారాయణరావు పాల్గొన్నారు.

సహకార సంఘ అభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ప్రశాంత్

కాటారం, మార్చి 21(ఆంధ్రజ్యోతి):ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి అధికారులు, రైతులు, పాలకవర్గం సమిష్టిగా కృషి చేయాలని పీఏసీఎస్ చైర్మన్ తోటపెల్లి ప్రశాంత్ కోరారు. శుక్రవారం పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దీర్ఘకాలిక లోన్లు ఇవ్వాలని, లావణీపట్టా భూములకు సైతం కేటగిరీలవారీగా రుణాలివ్వాలని, మొండి బకాయిదారులపై చట్టపరమైన చర్యలకు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రశాంత్ మాట్లాడుతూ దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు, ధాన్యం సేకరణతో సంఘం గత తొమ్మిదేళ్లుగా లాభాల బాటలో ఉందన్నారు. సంఘంలో 4,588మంది సభ్యులు, సుమారు రూ.60కోట్ల టర్నోవర్, రూ.14.30కోట్లకు పైగా రుణాలతో ప్రగతి బాటన ఉందన్నారు. సంఘం సుమారు రూ.9 కోట్ల ఆస్తులతో అభివృద్ధి దిశగా సాగుతుందన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, సహకారశాఖ సీనియర్‌ఇన్‌స్పెక్టర్ రిలీఫ్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, చీమల సత్యం, జక్కుల అజయ్ కుమార్ , ఐలి రాజబాపు, బాసాని హిమాకర్, బండి రమేష్, దండ్రు రాజయ్య, ఐత కృష్ణవేణి, మారపాక రాజేశ్వరి, పీఏసీఎస్ సిబ్బంది, రైతులు వెంకట్రాజం, భూపెల్లి రాజు, కుంభం రమేష్‌రెడ్డి, సమ్మయ్య, రాజయ్య, పురుషోత్తం, సుధాకర్, బాపు, మల్లయ్య, పోచయ్య పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం

కాటారం, మార్చి 21(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలో ప్రపంచ అటవీ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాటారం ఎఫ్‌ఆర్వో స్వాతి ఆధ్వర్యంలో అటవీశాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. కాటారం మండల కేంద్రంలోని రేంజ్ సమదాయంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డిప్యూటీ రేంజ్ అధికారి సురేందర్ మాట్లాడుతూ అడవులను, చెట్లను సంరక్షించడం అందరి బాధ్యతని, ప్రకృతి సమతుల్యత దెబ్బతినకుండా అటవీశాఖ అధికారులతో కలిసి అందరు కృషి చేయాలన్నారు. పచ్చని చెట్లు, పక్షుల కిలకిలరావాలు, వన్యప్రాణుల సందడి, చల్లని గాలి ప్రజలకు ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుందని, మంచి ఆరోగ్యం కల్గిస్తాయన్నారు. ప్రభుత్వం అడవుల సంరక్షణపై సీరియస్‌గా ఉందని ఎవరైనా అడవులకు నష్టం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అడవులను నరికినా, ఎరగడి మంటలు వ్యాపించినా, చెట్లను కొట్టేసినా, పోడు చేసినా, వన్యప్రాణులను చంపినా, కలప స్మగ్లింగ్ జరిగినా ప్రజలు అధికారులకు సమాచారమివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో చంద్రశేఖర్, ఎఫ్‌బీవోలు సంజీవ్, జయలక్ష్మి, రాజ్‌కుమార్, రాజేందర్, సిబ్బంది రవి, అంజి తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా సమస్యలు పరిష్కరించుకోవాలి

కృష్ణకాలనీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మీసేవ నిర్వాహకులు, ఆపరేటర్లంతా సమష్టిగా ఉంటూ సమస్యలను పరిష్కరించుకుందామని అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కొత్త కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మీసేవ నిర్వాహకులు, ఆపరేటర్స్ సమావేశం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మీసేవ అసోసియేషన్ బిల్డింగ్ ఏర్పాటుకు స్థల సేకరణ చేసుకుందామన్నారు. వచ్చే రూ.3వేల నుంచి 5వేల కమిషన్‌తో మీసేవ సేవా సెంటర్‌లు నడపడం కష్టంగా మారుతుందని, కమిషన్ పెంచేలా అధికారులు చొరవ చూపాలన్నారు. తహసీల్ కార్యాలయాల్లో మీసేవ ఆపరేటర్లకు మర్యాద ఇవ్వడం లేదని, ఆన్‌లైన్‌లో ఎవరో చేసిన తప్పులకు ఆపరేటర్స్‌పైన చర్యలు తీసుకోవడం ఏంటని ఆయన ప్రశ్నించారు. మీసేవ ఆపరేటర్‌లకు ఐడీకార్డు, హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిరికొండ రామారావు, గౌరోజు విష్ణుమూర్తి, తోట అనూష, ఎండీ ఉంతియాజ్ పాల్గొన్నారు.

సెంట్రల్ డివైడర్‌పై బోల్తాపడిన లారీ

కాటారం, మార్చి 21(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రం శివారులో నిర్మాణంలో ఉన్న కాటారం-మంథని ఫోర్‌లేన్ రహదారిపై గురువారం అర్ధరాత్రి మట్టి లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి సెంట్రల్‌డివైడర్‌పైకి దూసుకెళ్లి బోల్తాకొట్టింది. వరంగల్ నుంచి మట్టి లోడ్‌తో మంచిర్యాల సిమెంట్ ఫ్యాక్టరీకి వెళ్తున్న లారీ ఇటీవల వేసిన సెంట్రల్ డివైడర్‌పైకి దూసుకెళ్లి బోల్తాపడింది. లారీ డివైడర్ పైకి దూసుకెళ్లడంతో 20మీటర్లకు పైగా డివైడర్‌తో పాటు లారీ అడుగు భాగం ధ్వంసమైంది. పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి లారీని అక్కడినుంచి తీసేయించారు. కాగా ఈ సంఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు.

జగ్గన్నపేటలో ప్రత్యేక గ్రామసభ



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న గ్రామస్థులు

ములుగు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని జగ్గన్నపేటలో శుక్రవారం ప్రత్యేక గ్రామసభ జరిగింది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశాలతో అదనపు కలెక్టర్ సంపత్‌రావు ఆధ్వర్యంలో అధికారులు సభను నిర్వహించారు. గ్రామపంచాయతీ ఆవరణలో జరిగిన ఈ సభలో స్థానిక సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అధికారులకు వినతిపత్రాలను సమర్పించారు. ప్రజల అవసరాలు, సమస్యలపై నివేదిక రూపొందించి జిల్లా కలెక్టర్‌కు సమర్పించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ సంపత్‌రావు తెలిపారు. ఎంపీడీవో రామకృష్ణ, మండల ప్రత్యేకాధికారి కొమురయ్య, తహసీల్దార్ విజయభాస్కర్, ఎంపీవో రహీమొద్దిన్, ఎస్సై వెంకటేశ్వర్‌రావు, పంచాయతీరాజ్ డీఈ లింగమూర్తి, ఎన్‌పీడీసీఎల్ డీఈ నాగేశ్వర్‌రావు, ఆర్అండ్‌బీ, హర్టికల్చర్, ఇరిగేషన్, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలను విడుదల చేయాలి

ఏటూరునాగారం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేశాలని మిషన్ భగీరథ కార్మికులు మిషన్ భగీరథ డబ్ల్యూటీపీ ఎదుట బైఠాయించి శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. మూడు నెలలుగా జీతాలు లేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా ఏటూరునాగారం మండలం రొయ్యూర్ సిగ్నెట్‌లోని మిషన్ భగీరథ డబ్ల్యూటీపీ ఎదుట ధర్నా నిర్వహించామన్నారు. ప్రతి కార్మికుడికి వెంటనే ఐటీ కార్డు మంజూరు చేయాలని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో రొయ్యూర్ సిగ్నెట్లో పనిచేస్తున్న మిషన్ భగీరథ కార్మికులు కాళ్ళ రామకృష్ణ, నవీన్, సిసింద్రీ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం నిర్ణయించాలి

ములుగు కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్లకు కార్మికులుగా గుర్తించి కనీస వేతనం నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ డిమాండ్ చేశారు. జాతీయ ఆరోగ్య పథకాన్ని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆశా వర్కర్లు డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ప్లకార్డులు చేతబూని నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు స్థిరమైన ప్రోత్సాహకాలపై షరతులను ఎత్తివేసి కనీస వేతనచట్టం ప్రకారం కనీస వేతనం రూ.26వేలు అందించాలని, సామాజిక భద్రత, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ఆశా లను మూడోతరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఎస్‌హెచ్‌ఎం స్కీంకు అధిక నిధులు కేటాయించాలని, సామాజిక భద్రత పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఎంహెచ్‌వో కార్యాలయంలో అధికారికి అందజేశారు. ఆశా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నీలాదేవి, నాయకురాళ్లు రజిత, సుధ, అనిత, ఛాయాదేవి, రమాదేవి, సంధ్య పాల్గొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణకు 'హైపర్' పథకం

భూపాలపల్లిటౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఏదైనా అనుకోని సందర్భంలో విపత్తులు జరిగినప్పుడు వెంటనే విద్యుత్ పునరుద్ధరణ చేయడానికి 'హైపర్' పథకం అమలులోకి తీసుకువచ్చినట్లు జిల్లా విద్యుత్‌శాఖాధికారి మల్చూర్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైపర్ అంటే... పూర్తి వివరాలు తెలిపారు. జిల్లాలో సమర్థవంతంగా హైపర్‌ను నిర్వహించడానికి ప్రతీ ఒక్క ఉద్యోగి బాధ్యతతో హెడ్ క్వార్టర్స్‌లో ఉండాలని సూచించారు. సిబ్బందిని, సామగ్రిని అందుబాటులో పెట్టుకుని సమాచారం తెలుసుకున్న వెంటనే స్పందించి అక్కడ పనులు చేపట్టి పునరుద్ధరించాలని ఉద్యోగులకు ఆదేశించారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడానికి గాను ఘణనీయమైన అభివృద్ధి సాధించే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు.

చిట్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

చిట్యాల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పాత తాలుకా కేంద్రం చిట్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని టీటీడీపీ జిల్లా అడ్‌హక్ కమిటీ సభ్యుడు కోడెల భద్రయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మావేశంలో ఆయన మాట్లాడారు. దూడపాక సాంబయ్య, కొత్తూరి జయపాల్, గుమ్మడి శంకర్‌రావు, సామల సాంబయ్య, కుర్ర సుబ్బారావు పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం కమిటీ ఎన్నిక

చిట్యాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : అంబేద్కర్ యువజన సంఘం మండల నూతన కమిటీని శుక్రవారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జన్నె యుగందర్, ప్రధాన కార్యదర్శిగా పుల్ల ప్రతాప్, ఉపాధ్యక్షులుగా కనకం తిరుపతి, గుర్రం అశోక్, సహాయ కార్యదర్శులుగా బోనగిరి తిరుపతి, నరేష్, ప్రచార కార్యదర్శిగా కట్కూరి రాజు, కోశాదికారిగా కట్కూరి రాజేందర్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కవిటీ సభ్యుడు మల్లయ్య, సభ్యులు రాజేందర్, రమేష్, రాజమౌళి, ప్రణీత్, సరోత్తం, మహేష్ పాల్గొన్నారు.

కోతుల దాడిలో వ్యక్తికి తీవ్రగాయాలు

కాటారం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన కాటారం గ్రామానికి చెందిన పాడి రాజబాపు అనే వ్యక్తి శుక్రవారం కోతుల దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..కోతుల గుంపు రాజబాపు ఇంటిపైకి రాగా వెళ్లగొట్టే ప్రయత్నం చేశాడు. దీంతో పలు కోతులు దాడి చేసి రాజబాపు కాలిపై కొరకడం, రక్కడంతో తీవ్ర గాయాలయ్యాయి. రాజబాపును కుటుంబసభ్యులు భూపాలపల్లి 100పడకల ఆస్పత్రికి చికిత్స కోసం తీసుకెళ్లారు. ఇటీవల నాలుగైదు రోజుల క్రితం పున్నం లక్ష్మి అనే మహిళను సైతం కోతులు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయని గ్రామస్తులు తెలిపారు. అధికారులు చర్యలు తీసుకుని కోతులను నియంత్రించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సింగంపల్లి గ్రామపంచాయతీలో దొంగతనం

మహాముత్తారం, మార్చి21(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగంపల్లి గ్రామపంచాయతీలో కొద్ది రోజుల క్రితం దొంగతనం జరిగింది. ఇదే భవనంలో టీ ఫైబర్ ఇంటర్‌నెట్‌కు సంబంధించిన పరికరాలను అమర్చారు. ఈ పరికరాల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన బ్యాటరీని ఈ నెల 15న దొంగలు ఎత్తు కెళ్లారు. ఐతే ఈ భవన తలుపులు సక్రమంగా లేకపోవడంతోనే దొంగతనం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇదే విషయంలో గ్రామ కార్యదర్శి వీరయ్యను సంప్రదించగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలుపగా ఎస్సై మహేందర్‌కుమార్ మాత్రం కార్యదర్శి వచ్చి కలసి వెళ్లారని ఫిర్యాదు మాత్రం చేయలేదని తెలిపారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

మొగుళ్లపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి సుదర్శన్ గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలకే ంద్రంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలకు అండగా పార్టీ ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. పార్టీ ఎదుగుదలకు కార్యకర్తలు కృషి చేయాలని తెలిపారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి నడిగోటి రాము, నాయకులు యార రవి, మంద స్వామి, ప్రకాష్‌రావు, రాజేశ్వర్‌రావు, మంగళపల్లి శ్రీనివాస్, విజయ్‌కుమార్, తిరుపతి పాల్గొన్నారు.

బతుకులు బూడిదపాలు

(5వ పేజీ తరువాయి)

సమస్యలు తలెత్తుతున్నాయని, ప్రధానంగా ఊపిరితిత్తులు, కిడ్నీ, కంటి, శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రాణాలతో జెన్‌కో యాజమాన్యం చెలగాటమాడుతోందని మండిపడుతున్నారు.

- కారణాలు ఇవే..

కేటీపీపీ ప్రారంభమయ్యాక... ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గాను 2012 నుంచి 2019 వరకు జెన్‌కో యాజమాన్యం ఉచితంగా బూడిదను పంపిణీ చేసింది. కానీ బూడిదకు గిరాకీ పెరగడంతో దురాశకు వెళ్లిన యాజమాన్యం 2019లో రూ.30లకు టన్ను చొప్పున టెండర్లను పిలిచింది. 2023- 24 వార్షిక సంవత్సరంలో టెండర్లు పిలవగా అందులో రూ.200లకు ధర పలికింది. అయితే ఈ టెండరును ఓపెన్ చేయకుండానే పాత ధరకే (రూ.300) నేటి వరకు కొనసాగిస్తోంది. పలుమార్లు టెండర్ ఓపెన్‌చేసి ఖరారు అయిన ధరకు నిర్ణయించాలని లారీల యాజమానులు మొరపెట్టుకున్నా.. జెన్‌కో యాజమాన్యం లెక్కచేయలేదని ఆరోపించారు. దీనికి తోడు రాష్ట్రంలో ఉన్న మిగతా విద్యుత్ కేంద్రాలైన ఎన్‌టీపీసీ, పాల్వంచ, మణుగూరు, జైపూర్‌లలో రూ.100 నుంచి రూ.200లకే టన్ను ధర చొప్పున పంపిణీ చేస్తుండగా కేటీపీపీ మాత్రం రూ.300లకు పంపిణీ చేస్తుంది. ఈ క్రమంలో ఈ ప్రాంత లారీల యాజమానులు మొదటగా ఉన్న ఉత్సాహాన్ని ఇప్పుడు చూపడం లేకపోతున్నారు. కారణమేటిమంటే.. గతంలో వారికి అనుకు న్న విధంగా సిమెంట్ ప్యాక్టరీలు, ఇతర పరిశ్రమల నుంచి గిరాకీ తగిలి లాభాలు వచ్చేవి. కానీ రేటు గిట్టుబాటు పడక, అనుకున్న దానికంటే.. తక్కువ రేటు చెల్లిస్తానని కంపెనీలు చెప్పడంతో యాష్ కొనుగోలుకు లారీ యజమానులు మొగ్గుచూపలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో గతరెండు రోజుల నుంచి పూర్తిగా యాష్ తీసుకువెళ్లే లారీలు నిలిచిపోయాయి. ఇలా ప్రతీ పదిరోజులకు ఒకసారి జరిగే తంతులా మారిందని లారీ యజమానులు చెబుతున్నారు. దీంతో యా జమాన్యం బూడిదను బయటికి పంపలేక, టెండర్లు లేక అర్ధరాత్రి ఊరి మీద కు వదులుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాదు.. తాము తయారుచేసిన చెరువులోకి వదులుతుందని చెబుతున్నారు. దీంతో యాష్ పూర్తిగా గ్రామంపై పడి నరకం చూస్తున్నామని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

- ప్రభుత్వ ఆదాయానికి గండి..

ఒక వైపు లారీ యజమానులు నష్టపోవడమే కాకుండా మరోవైపు ప్రభుత్వ ఆదాయానికి కూడా గండిపడుతుంది. ప్రతీరోజు కేటీపీపీ ఫ్లైయాష్ ట్యాంకర్ల నుంచి 3000 టన్నుల బూడిద ఉత్పత్తి అయి, 2700 టన్నుల వరకు నిత్యం రవాణా జరిగేది. కానీ గత కొంతకాలంగా ధర గిట్టుబాటు కాకపోవడంతో ప్రతీరోజు కనీసం పది లారీలు కూడా నడవడం లేదంటే అతిశయోక్తి లేదు. దీంతో కేటీపీపీ యాజమాన్యంకు ప్రతీ రోజు సుమారు రూ. 8లక్షల వరకు నష్టం వస్తుండగా, లారీల యజమానుల ఉపాధి అవకాశాలకు నష్టం వాటిల్లుతోంది. రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ సౌధ ఉన్నతాధికారులు చొరవచూపి ఇటు ఫ్లైయా ష్‌ను తక్కువ ధరకే రవాణా జరిగేలా చర్యలు తీసుకోవడమే కాకుండా వీలైనం త త్వరగా దుబ్బపల్లిని కూడా తరలించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బూడిదను గాలిలోకే వదులుతున్నారు


- మహ్మద్ సాజీద్, దుబ్బపల్లి



కేటీపీపీ సైలోల ద్వారా వెలువడే బూడిదను రాత్రి సమయంలో గాలిలోకే వదులుతున్నారు. ఈ బూడిదంతా గ్రామంపై పడి తీవ్ర ఇబ్బందులకు గురవతున్నాం. ఇటీవల రాత్రి సమయంలో నేను సైలోల ముందు రోడ్డు నుండి వస్తున్న క్రమంలో ఒక్కసారిగా మీద పడి రహదారి కనిపించఉండాపోయింది. జెన్‌కో ఉన్నతాధికారులు మా గ్రామాన్ని తరలించి అనారోగ్య సమస్యల నుంచి కాపాడాలని వేడుకుంటున్నాం.

నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలి

ములుగు కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పక్కాగా కొనుగోలు చేయాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు ట్రక్ షీట్ అందించాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు నిర్వహించిన శిక్షణ, అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో రబీ(యాసంగి) ధాన్యం జిల్లాలో దాదాపు 92,113 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా 145ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నా మని అన్నారు. జిల్లావ్యాప్తంగా పూర్తిస్థాయిలో 145 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో డిజిటల్ వేయింగ్ యంత్రాలను మాత్రమే వినియోగిస్తున్నా మని, వాటి పనితీరును జిల్లా తూనికలు, కొలతలశాఖ అధికారి తనిఖీ చేయాలన్నారు. రైస్‌మి ల్లుల వద్ద కోత పెట్టినా, ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ట్రక్ షీట్ జారీ చేయక పోయినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు.అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీ, అదనపు ఎస్పీ సదానందం, ఆర్డీవో వెంకటేష్, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి షాఫైజల్ హుస్సేని, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ రాంపతి, జిల్లా సహకార అధికారి సర్దార్‌సింగ్, డీఏవో సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ములుగు కలెక్టర్ దివాకర